# జాతి విముక్తి కోసం..

## కేసీఆర్ (తెలంగాణ చంద్రుడు)

తరాలుగా దగాపడ్డ తెలంగాణ జాతికి విముక్తి నిచ్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్. పెత్తందారీ వ్యవస్థ, పటేల్-పట్వారీల అరాచకాలు.. సామాన్యుల బతుకుల్ని నరకం చేశాయి. ఇక, సమైక్య పాలనలో అయితే ఆది నుంచీ వివక్షే. సాగు-తాగు నీరు, విద్య, ఆరోగ్యం, నిధులు, అభివృద్ధి, ఉద్యోగాలు.. ఇలా అన్ని విషయాల్లోనూ తెలంగాణపై చిన్నచూపే. కక్షగట్టినట్టు సాగిన ఆ వివక్ష కేసీఆర్‌ను కదిలించింది. తెలంగాణ జాతి విముక్తికి మరో ఉద్యమం అనివార్యమని భావించారు. స్వయంపాలన, ఆత్మగౌరవ నినాదంతో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తెచ్చారు. చావు అంచులవరకూ వెళ్లి తెలంగాణ ఆకాంక్షను బతికించారు. ప్రత్యేక రాష్ర్టాన్ని సాకారం చేశారు. అందుకే ఏఐ వేదిక చాట్‌జీపీటీ సైతం కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా అభివర్ణించింది.






## నెల్సన్ మండేలా (నల్లజాతి సూరీడు)

ఆదిమానవులకు దగ్గరగా.. ఆధునిక ప్రపంచానికి దూరంగా చీకట్లో మగ్గిపోతున్న దక్షిణాఫ్రికా నల్ల జాతీయుల జీవితాల్లో కోటివెలుగుల సూరీడు నెల్సన్ మండేలా. రాకాసి కరువులు, ఆకలి చావులు.. ఇవన్నీ చాలవన్నట్టు శ్వేత జాత్యహంకార పాలకుల చెరలో దినదిన గండంగా మారిన బతుకులకు మండేలా రూపంలో కొండంత అండ దొరికింది. ఆ యోధుడు తమ జాతి హక్కుల్ని కాపాడేందుకు ఉద్యమ కెరటం అయ్యాడు. అహింసా మార్గంలో పోరాటాన్ని ఉద్ధృతం చేశాడు. ఆ పోరు పాలకవర్గానికి వణుకు పుట్టించింది. వర్ణ వివక్షకు స్వస్తి పలకాల్సిన అనివార్య పరిస్థితిని కల్పించాడు. మండేలా నాయకత్వంలో దక్షిణాఫ్రికా స్వేచ్ఛావాయువులు పీల్చింది. ఆ సేవలకుగానూ నోబెల్ శాంతి బహుమతి వరించింది. కేంద్ర సర్కారు సైతం 'భారతరత్న' పురస్కారాన్ని ప్రదానం చేసింది.

# సుజలాం.. సుఫలాం!

## కేసీఆర్ (మిషన్ కాకతీయ)

కేసీఆర్.. తెలంగాణకు జలమే జీవమని భావించారు. చెరువులు, వాగుల పునరుద్ధరణకు నడుంకట్టారు. శతాబ్దాల నాటి జలాశయాలకు మరమ్మతులు చేయించారు. ఈ బృహత్తర క్రతువుకు 'మిషన్ కాకతీయ'గా నామకరణం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 46,531 చెరువులను దశలవారీగా పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆ ప్రయత్నం వృథాగా పోలేదు. చెరువుల పూడికతీత ద్వారా 9.14 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. అవసరాన్ని బట్టి, పాత చెరువుల విస్తీర్ణాన్ని పెంచారు. ఆ అపార కృషి ఫలితమే.. పచ్చని పొలాలు, ముక్కారు పంటలు.





## రాజేంద్రసింగ్ (వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా)

పిచ్చిమొక్క కూడా మొలవని రాజస్థాన్ థార్ ఎడారిలో నీటి పంట పండించారు రాజేంద్రసింగ్. అల్వార్ జిల్లాలో భాగమైన కిశోరీ-భీకాంపురా తదితర గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉండేది. అవినీతి రుచి మరిగిన స్థానిక పాలక వర్గం ప్రజల గోస పట్టించుకునేది కాదు. తాగు-సాగునీటి కోసం అల్లాడుతున్న గ్రామస్థులకు డాక్టర్ రాజేంద్రసింగ్ ఓ ఆశాకిరణంగా మారారు. వాననీటి నిల్వ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం అవసరాన్ని తెలియజేశారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆ కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా ముందుకు నడిపారు. ఫలితంగా ఎడారి నేలలో జల వనరుల గలగల రాగం వినిపించింది. రాజేంద్రసింగ్ సేవలకు రామన్ మెగసెసే అవార్డు వరించింది. 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గానూ గుర్తింపు పొందారు.